ప్రజాశక్తి

బుధవారం 21 మే 2025 | 5 | అనంతపురం

ఆగనున్న ఆర్డీటీ వైద్యసేవలు..?

- ప్రశ్నార్థకంగా పేద ప్రజల ఆరోగ్యం
- ఇప్పటికే విద్యా సేవలను నిలిపేసిన సంస్థ
- ఆందోళనలో వేలాది మంది ఉద్యోగులు
- దిన దిన గండంగా సేవల నిర్వహణ

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆర్డీటీ (రూరల్ డెవలప్‌మెంట్‌ట్రస్టు) నిర్వహణ అంశంపై ప్రధానంగా చర్చ జరుగుతోంది. ఉమ్మడి అనంతరం జిల్లాతో పాటు అటు తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లోనూ ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్‌ఎ(ఫారిన్ కాంట్రిబ్యూటరీ రెగ్యులేషన్ యాక్ట్) పునరుద్ధరణ అంశంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. బడుగు, బలహీన, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యంగా కరువు ప్రాంతాల్లో ఆర్డీటీ ఐదు దశాబ్దాలకు పైగా అండగా ఉంటోంది. అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తూ వారిని ఆదుకుంటూ ప్రజల మన్ననలు పొందింది. ఆ సంస్థ నిర్వహిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక అత్యున్నత అవార్డులు, సత్కారాలను అందించాయి. ఇలా ఎంతో ఉన్నత స్థాయి సేవలను అందిస్తున్న ఆర్‌డిటికి ప్రస్తుతం కష్టమొచ్చింది. సంస్థ ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యువల్ చేయకపోవడంతో ఒక్కసారిగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో సంక్షోభం నెలకొంది. ఇప్పటికే విద్యాసేవలను నిలిపివేసిన సంస్థ వైద్యసేవలను కూడా నిలివేయనున్నట్లు సమాచారం. ఇదే జరిగితే ఉమ్మడి జిల్లాలోని పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడటం ఖాయం.

ప్రజాశక్తి - అనంతపురం సిటీ

ఆర్‌డిటి ఉమ్మడి అనంతపురం జిల్లాలో విద్య, వైద్యం, ఉపాధి, సంక్షేమం, వ్యవసాయం, స్వయం ఉత్పత్తి సాధికారత లక్ష్యంగా ప్రభుత్వ అంచనాలకు మించి క్షేత్రస్థాయిలో అట్టడుగు స్థాయి ప్రజలను అభివృద్ధి వైపు నడిపించిందని చెప్పవచ్చు. అలాంటి సంస్థ మొట్టమొదటిసారిగా ఎఫ్ సి ఆర్ ఏ కారణంగా ఈ ఏడాది ఆర్‌డిటి సెట్‌ను నిలిపివేసింది. కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి పేద విద్యార్థులను విద్యావంతులుగా, ఉద్యోగాలుగా తీర్చిదిద్దే లక్ష్యం నీరుగారిపోయింది. ఇక అత్యవసరమైన వైద్యరంగం పైన ఎఫ్‌సిఆర్‌ఎ ప్రభావం పడుతుందనే భావన ఇప్పుడు అందరిని ఆందోళనకు గురి చేస్తోంది. మెరుగైన వైద్యం అంటేనే ముందుగా జిల్లాలలో ఆర్డీటీ పేరు వినపడుతుంది. ఎఫ్‌సిఆర్‌ఎ కారణంగా వైద్యరంగంలో విపత్కరమైన పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మరో నెలపాటు ఇదే క్రమంలో కాలం గడిస్తే ఆర్డీటీ నిర్వహిస్తున్న ఆసుపత్రులను మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని సమాచారం. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఆర్డీటీ ఆసుపత్రుల్లో ఏటా 8.5 లక్షల అవుట్ పేషెంట్‌లు, 46వేల మంది ఇన్ పేషెంట్ అడ్మిషన్లు, 14వేల డెలివరీలు, 15వేల సర్జరీలు జరుగుతున్నాయి.

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు, నిరుపేద రోగులకు నాణ్యమైన సంరక్షణ సేవలను అందించడానికి ఆర్డీటీ బత్తలపల్లి, కళ్యాణదుర్గం, కణేకల్‌లో మొత్తం 532 పడకలతో మూడు గ్రామీణ ఆసుపత్రులను స్థాపించింది. ఆరోగ్య సేవలకు అధిక ఖర్చులు భరించేలేని అనేకమంది గ్రామీణ రోగులకు అతి తక్కువ ఖర్చుతో ఆర్డీటీ వైద్యసేవలను అందిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల కారణంగా ఈ ప్రధాన ఆసుపత్రులను మూసివేస్తే పేదల ఆరోగ్యంపై ప్రభావం పడే ప్రమాదం ఉంది.

బత్తలపల్లిలోకి ఆర్డీటీ ఆసుపత్రి

ప్రస్తుతం కళ్యాణదుర్గం, బత్తలపల్లి ఆసుపత్రిలో 36 మంది నవజాత శిశువులు నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్‌ఐసియు)లో చికిత్స పొందుతున్నారు. వారిలో 9 మంది చాలా అనారోగ్యంతో ఉన్న పిల్లలు ఉన్నారు. ఆసుపత్రుల అనిశ్చిత పరిస్థితి కారణంగా ఈ క్లిష్టమైన నవజాత శిశువులందరి ప్రాణాలకు ప్రమాదం ఉందని అక్కడి వైద్యులు చెబుతున్నారు. ప్రతి సంవత్సరం ఆర్డీటీ ఆసుపత్రులలో పేద, అవసరమైన రోగులకు 15వేల శస్త్రచికిత్సలు చేస్తున్నారు. వాటిలో 5వేలకు పైగా సంక్లిష్ట శస్త్రచికిత్సలు చేస్తున్నారు. అంతేకాకుండా అత్యంత సాధారణ శస్త్రచికిత్సలు సిజేరియన్ విభాగం (అత్యవసర, ఎలెక్టివ్), అన్ని అత్యవసర ట్రామా కేసులు, ఓపెన్ అబ్డామినల్ సర్జరీలు, గైనకాలజికల్, అబ్డామినల్ లాపరోస్కోపిక్ సర్జరీలు కూడా ఉన్నాయి. అదేవిధంగా 171 మంది తలసేమియా పిల్లలు ఆర్డీటీ ఆసుపత్రుల్లో ఉన్నారు. వారిలో 127 మంది రక్త మార్పిడిపై ఆధారపడి ఉన్నారు. బోన్ మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం 26 మంది పిల్లలను స్పాన్సర్ చేసింది. ఈ పిల్లలందరూ ఆర్డీటీ ఆసుపత్రులపై ఆధారపడి ఉన్నారు. వీరితో పాటు డయాబెటీస్, మూర్ఛవ్యాధి తదితర రోగాలతో బాధపడుతున్న వారు ఆర్డీటీ సేవలపైనే ఆధారపడి ఉన్నారు. ఎఫ్‌సిఆర్‌ఎ కారణంగా ఆర్డీటీ గ్రామీణ ఆసుపత్రులు అందించే ఈ ప్రామాణిక, ప్రత్యేక ఆరోగ్య సంరక్షణ సేవలన్నీ మూసివేయబడే ప్రమాదం ఉంది. దీని ఫలితంగా లక్షలాది గ్రామీణ ప్రజలకు అవసరమైన ఆరోగ్య సంరక్షణ సేవలు నిలిచిపోతాయి. అంతేకాకుండా ఆరోగ్య సంరక్షణ కార్యకర్తలకు ఉపాధి కోల్పోవాల్సి వస్తుంది.

ఈనేపథ్యంలో అత్యున్నతమైన సేవలను అందిస్తున్న రూరల్‌డవలప్‌మెంట్ ట్రస్టును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ముఖ్యంగా అనంతపురం జిల్లాలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం జరుగుతోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని పేద ప్రజలు సామాన్యుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాల్సి ఉందని ప్రజలు మేధావులు రాజకీయ నాయకులు కోరుతున్నారు.

ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

కార్పొరేట్లకు కేంద్రం ఊడిగం

ధర్నాలో కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసేలా కేంద్రంలోని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తోందని కార్మిక, కర్షక సంఘాల నేతలు విమర్శించారు. ప్రభుత్వ రంగాల ప్రయివేటీకరణ ఆపాలని, లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం అనంతపురం జిల్లా కేంద్రంలోని బిఎస్ఎన్ఎల్, తపాలా శాఖ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. సిఐటియు, ఎఐటియుసి నగర కార్యదర్శులు ముత్తుజా, కృష్ణుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజారెడ్డి, వైఎస్ఆర్‌టియు నాయకులు ఓబిరెడ్డి, కొర్రపాడు హుస్సేన్ పీరా, ఐఎఫ్‌టియు నాయకులు ఏసురత్నం తదితరులు హాజరై మాట్లాడారు. బ్రిటిష్ పాలకులతో కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సైతం మోడీ మతోన్మాద ప్రభుత్వం కాలరాసేందుకు పూనుకుందన్నారు. భారతీయ కార్మిక వర్గాన్ని యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు నాలుగు లేబర్ కోట్లు తెచ్చిందని విమర్శించారు. ఈ లేబర్ కోడ్‌ల వల్ల కార్పొరేట్లకు లాభాలు పెరిగి, కార్మికులు ఏ హక్కులు లేని బానిసలుగా మారిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. 3 నల్ల చట్టాలతో రైతులను, 4 లేబర్ కోడ్లలో కార్మికులను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు మోడీ ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. కార్మిక వ్యతిరేక ప్రజావ్యతిరేక రైతు వ్యతిరేక విధానాలకు సమ్మెల ద్వారా కట్టడి చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తు, నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం, ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం నుండి కాపాడుకునేందుకు జులై 9వ తేదీ జరిగే దేశవ్యాప్త సమ్మెలో పెద్ద ఎత్తున కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, ఎఐటియుసి, ఐ ఫ్‌టియు, వైఎస్ఆర్‌టియు, ఎఐఎఫ్‌టియు నాయకులు వేణుగోపాల్, మనోహర్, శ్రీనివాసరావు, సురేంద్ర, రాజేష్ గౌడ్, కిషోర్, శకుంతల, రమాదేవి, తిరుమలేష్, ఆదినారాయణ, లతీఫ్, నాగభూషణ, భాష, వరలక్ష్మి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, మల్లికార్జునతో పాటు నాగరాజు, చంద్రశేఖర్, బిహెచ్.రాయుడు తదితరులు పాల్గొన్నారు.

మినీ మహానాడులో కార్యకర్త ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాకేంద్రంలో మంగళవారం జరిగిన టిడిపి అనంతపురం అర్బన్ మినీ మహానాడులో ఆపార్టీ కార్యకర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన కలకలం రేపింది. అనంతపురం నగరంలోని కమ్మభవన్‌లో నిర్వహించిన మిని మహానాడులో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతున్న సందర్భంగా సాకే వెంకటేష్ అనే టిడిపి కార్యకర్త తన వెంట తెచ్చుకున్న క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి అక్కడి పడిపోయాడు. దీంతో అక్కడున్న నాయకులు, కార్యకర్తలు వెంకటేష్‌ను హుటాహుటిన సర్వజనాసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందించారు. ఈ సంఘటనతో ఒక్కసారిగా అక్కడున్న నాయకులు, కార్యకర్తలు షాక్‌కు గురయ్యారు. మినీ మహానాడు ఐదు నిమిషాల్లో విజయవంతంగా ముగుస్తుందన్న సమయంలో హఠాత్తుగా కార్యకర్త వేదిక ముందుకు వచ్చి విషద్రావణం తాగడం కలకలం రేపింది. అయితే కార్యకర్త వెంకటేష్ పార్టీలో ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. తాను పార్టీ కోసం పని చేస్తున్న తగిన గుర్తింపు లేదని, సమస్య చెప్పుకున్నా పరిష్కరించే నాథుడు లేడన్నట్లు తోటి కార్యకర్తలతో వెంకటేష్ వాపోయినట్లు సమాచారం. ఇటీవల రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌ను కూడా కార్యకర్త వెంకటేష్ కలిసి సమస్యలపై మొర పెట్టుకున్న స్పందన లేకపోవడంతో అసహనానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తోటి కార్యకర్తలు చెబుతున్నారు. అయితే ఇది పార్టీలో ఉన్న కొందరు అసంతృప్తవాదులు పన్నిన కుట్రగా భావిస్తున్నట్లు మరికొందరు టిడిపి కార్యకర్తలు చెబుతున్నారు. మినీ మహానాడు విజయవంతం అవుతుందనే కుట్రతోనే కార్యకర్త వెంకటేష్‌తో ఇలా ఆత్మహత్యాయత్నం చర్యలకు ప్రేరేపించారని విమర్శిస్తున్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, ఇతర నేతలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకటేష్‌ను పరామర్శించి మెరుగైన వైద్యం కోసం ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం బెంగుళూరుకు తరలించారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కార్యకర్తకు అయ్యే వైద్యఖర్చులన్నీ తానే భరిస్తానని ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు. ఈ సందర్భంగా కార్యకర్త కుటుంబ సభ్యులను పరామర్శించి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

వెంకటేష్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న కార్యకర్తలు

పింఛను ఇప్పించండి సారూ..

వృద్ధురాలు వేడుకోలు..

ప్రజాశక్తి-యల్లనూరు

'భర్త మరణించి ఒంటరిగా ఉన్నా.. పింఛన్ ఇప్పించి ఆదుకోండి' సారూ.. అంటూ ఓ వృద్ధురాలు వేడుకుంటోంది. మండల పరిధిలోని గొడ్డుమర్రి గ్రామానికి చెందిన 64ఏళ్ల ఎరికల అంజనమ్మ పింఛన్ సొమ్ము కోసం అర్థిస్తోంది. అంజనమ్మ భర్త గంగన్న 2023 నవంబర్ 19వతేదీన మరణించాడు. అప్పటి నుంచి వితంతు పింఛన్ కోసం అంజినమ్మ ఎదురు చూస్తూనే ఉంది. పింఛన్ కోసం ఆమె ఎక్కని కార్యాలయం గడపలేదు.. అడగని అధికారి లేడు.. అర్థించని నాయకుడు లేడు. బిసి, ఎస్సీ, ఎస్టీ, మధ్య తరగతి కుటుంబాల వారికీ 50ఏళ్లకే పింఛన్ అని చెబుతున్న పాలక ప్రభుత్వం వృద్ధురాలి పరిస్థితి ఏంటని స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మొన్నటికి మొన్న వితంతువులకు స్పాజ్ బుకింగ్ కింద ప్రభుత్వం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. అయితే భర్తల మరణానికి కటాఫ్ తేదీని 1/12/2023గా ప్రకటించింది. ఈ నిబంధన ప్రకారం ఆ తేదీ నుంచి మరణించిన వారు మాత్రమే అర్హులు. అంతకు మునుపు మరణించిన వారిని అనర్హులుగా పరిగణించింది. దీంతో అంజినమ్మతోపాటు మండలంలోని చాలామంది మహిళల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి అర్హులైన వృద్ధులకు నిబంధనలను సడలించి పింఛన్ల మంజూరు చేయాలని పండుటాకులు కోరుతున్నారు.

'హంద్రీ- నీవా'పై బహిరంగ చర్చకు సిద్ధం

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

విలేకర్లతో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి - రాయదుర్గం

హంద్రీనీవా పథకం మొదలైనప్పటి నుంచి లేదా గత పది ఏళ్లలో ఏ ప్రభుత్వ హయాంలో ఏ మేరకు అభివృద్ధి పనులు జరిగాయో, ఎంత అవినీతి జరిగిందో బహిరంగ చర్చకు తాను సిద్ధం అని రాయదుర్గం శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సవాల్ విసిరారు. మంగళవారం రాయదుర్గంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపికి చెందిన ఎమ్మెల్సీ శివరామిరెడ్డి చేసిన సూచనకు తాను స్పందిస్తున్నానన్నారు. 21వ తేదీ(బుధవారం)న ఉదయం 11 గంటలకు జీడిపల్లి రిజర్వాయర్ వద్ద రైతుల సమక్షంలో శివరామిరెడ్డితో తాను బహిరంగ చర్చలకు, మాటలకు సిద్ధం అని అన్నారు. ఎన్టీఆర్ కలల రూపం అయిన హంద్రీనీవా పథకాన్ని 1996లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఉరవకొండ నియోజకవర్గంలో శంకుస్థాపన చేశారన్నారు. 40 టీఎంసీల కు భూసేకరణ చేపట్టి 5.5 టీఎంసీల సామర్థ్యంతో కాలువ నిర్మాణానికి రూపకల్పన చేశారన్నారు. అప్పటి నిధుల లభ్యత ఆధారంగా ఈ పథకం చేపట్టేందుకు నాబార్డు ఆర్థిక సాయం పొందినట్టు చెప్పారు. 2007 సంవత్సరంలో జలయజ్ఞం పేరిట వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పనులు మొదలయ్యాయన్నారు. కాగా 2008- 09, 2009- 10 సంవత్సరాల కాలంలో "కాగ్"(కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) ఇచ్చిన నివేదిక ఆధారంగా జలయజ్ఞంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లు ఆధారాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా హంద్రీనీవా పథకం పై 'కాగ్' చేసిన ప్రకటనలు తన వద్ద ఆధారాలు ఉన్నట్లు చెప్పారు. అనంతరం రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రఘువీరారెడ్డి శ్రద్ధ వల్ల కొంతమేరకు పని జరిగిందన్నారు. 2014 సంవత్సరంలో చంద్రబాబు తిరిగి అధికారంలోకి వచ్చాక చొరవ తీసుకొని హంద్రీనీవా పథకాన్ని చేపట్టారన్నారు. వాటి ఫలాలను నేడు అనుభవిస్తున్నట్లు తెలిపారు. అనంతరం 2019 - 24 కాలంలో జగన్ నాయకత్వంలోని వైసిపి ప్రభుత్వం హంద్రీనీవా పథకం పట్ల నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. గత ఏడాది చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హంద్రీ- నీవా పథకాన్ని 3700 కోట్ల రూపాయలు నిధులు కేటాయించి 3850 క్యూసెక్కుల సామర్థ్యంతో కాలవ విస్తరణ పనులను శరవేగంగా చేస్తున్నట్లు తెలిపారు. జూలై పదో తేదీన నీటి విడుదలకు సంకల్పం తీసుకున్నట్లు చెప్పారు. గత పదేళ్ల కాలంలో లేదా హంద్రీనీవా పథకం చేపట్టినప్పటి నుండి ఇప్పటివరకు ఎవరి హయాంలో కాలువ నిర్మాణం పనులు ఏ మేరకు జరిగాయి? ఎంత అవినీతి జరిగిందో బహిరంగ చర్చకు తాను సిద్ధం అన్నారు. శివరామిరెడ్డి కూడా స్పందించి చర్చకు వస్తే వాస్తవాలు ప్రజలు రైతులకు తెలుస్తాయని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు.

చర్చకు నేనూ సిద్ధమే..

21న ఉరవకొండకు రండి

విప్ కాలవకు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సవాల్

ప్రజాశక్తి-ఉరవకొండ

విలేకర్లతో మాట్లాడుతున్న శివరామిరెడ్డి

హంద్రీనీవా అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు తాను కూడా సిద్ధమేనని శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి సవాల్ విసిరారు. హంద్రీనీవా ప్రాజెక్టు మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వం ఎంత ఖర్చు చేసిందో చర్చించడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. విప్ కాలవ శ్రీనివాసులు చెప్పినట్లు ఈనెల 21న బుధవారం ఉదయం 11 గంటలకు జీడిపల్లిలో కాకుండా ఉరవకొండలో హంద్రీనీవా ప్రాజెక్టుకు ఇద్దరు ముఖ్యమంత్రులు శంకుస్థాపన చేసిన ప్రదేశంలో ప్రజల సమక్షంలో బహిరంగ చర్చకు రావాలని కోరారు. ఏ ప్రాంతంలో అయితే ఈ ప్రాజెక్టుకు నాంది పడిందో అక్కడే, ఆ ప్రజల సమక్షంలోనే, ఆ రైతుల సమక్షంలోనే బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఉరవకొండను కూడా ఎందుకు ఎంచుకున్నామంటే ప్రజలు, రైతులు, నాయకులు అందరూ హాజరయ్యేందుకు రవాణా సౌకర్యంగా ఉంటుందని చెప్పారు. కావున బుధవారం కాలవ శ్రీనివాసులు వచ్చిన పర్వాలేదు.. లేక ఎవరినైనా పంపినా చర్చకు సిద్ధంగా ఉంటామని తెలిపారు.

వ్యవసాయ శాఖలో బదిలీల 'సాగు'

సిఫారసు లేఖల కోసం ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద ఉద్యోగులు

బదిలీల ప్రక్రియకు ఉమ్మడి జిల్లా వ్యవసాయ శాఖ సన్నద్ధం

ప్రజాశక్తి -అనంతపురం

వ్యవసాయ శాఖలో బదిలీల సాగు మొదలైంది. ఉద్యోగుల బదిలీలకు ఆన్‌లైన్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో బదిలీల ప్రక్రియకు ఉమ్మడి జిల్లా వ్యవసాయ శాఖ సన్నద్ధమైంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖలోని ఉద్యోగులు తమకు అనుకూలమైన చోటికి బదిలీ అవడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. కొందరు ఉద్యోగులు సిఫార్సు లేఖల కోసం ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు.

గత ఏడాది సీజన్ మధ్యలో బదిలీలు చేపట్టడం తో వ్యవసాయ శాఖలో బదిలీలు జరగలేదు. దీంతో అప్పట్లో బదిలీ కోరుకున్న వ్యవసాయ సిబ్బంది తీవ్ర నిరాశ కు లోనయ్యారు. ప్రస్తుతం ఇతర శాఖలతో పాటు వ్యవసాయ శాఖలో బదిలీలకు అవకాశం ఇవ్వడంతో ఆ శాఖ అధికారులు, సిబ్బందికి బదిలీ ఫీవర్ పట్టుకుంది. ఐదేళ్లు పూర్తయిన సిబ్బంది తమకు కావాల్సిన చోటకు బదిలీలు చేయించుకునేందుకు ప్రజాప్రతినిధులు ప్రాపకంతో సిఫార్సు లేఖలకోసం వారి ఇళ్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ శాఖ లో ఐదేళ్లు సర్వీస్ పూర్తి చేసుకున్న వారు 150 మంది ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో 62మందికి కమిషనరేట్ లో డివిజన్ ఎడిఎలకు, మరియు మండల ఏవోలకు బదిలీ ఉత్తర్వులు ఇస్తారు. వీరి లో ఉమ్మడి జిల్లాలో క్యాడర్ వారిగా చూస్తే డివిజన్ స్థాయి ఏడీఏలు ఐదుగురు ఉన్నారు. అందులో కదిరి, పెనుకొండ, మడకశిర, ధర్మవరం, తాడిపత్రి డివిజన్ ఎడిఎలు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. ఇక మండల వ్యవసాయ అధికారులు 125 మంది ఉంటే వీరిలో 36మంది మండల వ్యవసాయ అధికారులు ఒకే మండలంలో ఐదేళ్లసర్వీస్ పూర్తి అయిన వారు ఉన్నట్లు తెలుస్తోంది. ఇక అనంతపురం మండలం వ్యవసాయం అధికారి వచ్చి ఐదేళ్లు పూర్తి కానప్పటికీ ఇక్కడ కూడ రాజకీయ నాయకులు ప్రాపకం తో ఖాళీ చేయించి రావాలని కొందరు ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. అదే విదంగా అత్యధికంగా బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, మండలాలకు బదిలీ చేయించుకునేందుకు కొందరు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నటుల తెలుస్తోంది. ఇక వ్యవసాయ విస్తరణ అధికారులు పోస్టులు ఉమ్మడి జిల్లాలో 139 ఉంటే 12 ఖాళీ ఉన్నాయి. మిగిలిన వాటిలో 55 మంది గ్రేడ్- 1, గ్రేడ్-2ఏ వ్యవసాయ విస్తరణ అధికారులు ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న వారు ఉన్నట్లు తెలుస్తోంది. వీరి బదిలీల్లో మరింత పోటీ నెలకొన్నట్లు సమాచారం. వీరికి తోడు ఐదేళ్లలోపు సర్వీస్ ఉన్నవారు కూడా ఉన్న అధికారులు, సిబ్బందికి కూడ బదిలీలకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. దీంతో వ్యవసాయ శాఖ లో బదిలీలు ఫీవర్ నెలకొంది. వ్యవసాయ శాఖలో ఈనెల 28వతేదీలోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈనెల 25వతేదీ సాయంత్రం 5 గంట ల్లోపు సీనియర్ అసిస్టెంట్లు, ఏఓలు, ఏడీఏలు ఆన్లైన్లో బదిలీల కోసం ఆప్షన్లు ఇవ్వాలని గడువు విధించారు. అయితే 20వ తేదీ సాయంత్రం వరకు ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకొనే అవకాశం లేకుండా పోయింది. వెబ్‌లింక్ ఓపన్ కాకపోవటంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. మరో వైపు బదిలీలు కోసం జిల్లా ప్రజాప్రతినిధుల లెటర్ల కోసమే గాకుండా మరింత రికమండేషన్ గట్టిగా ఉంటుందనే ఉద్దేశంతో ఏకంగా నారా లోకేష్ నుంచి కూడా రికమండేషన్ లెటర్లు కొందరు అధికారులు తీసుకున్నట్లు సమాచారం. ఈనెల 26న అనంతపురం జేడీఏ కార్యాలయంలో జోన్-4 పరిధిలోని జిల్లాల జేడీఏలు అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు ఉమ్మడి జిల్లాల జేడీఏలు కౌన్సిలింగ్‌కు హాజరుకానున్నారు. సీనియర్ అసి స్టెంట్లు, ఏఓలు, ఏడీఏలు ఆన్లైన్లో ఇచ్చిన ఆప్షను పరిశీలించి, కమిషనరేట్‌కు పంపుతారు. ఏఈఓలు, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర కిందిస్థాయి సిబ్బంది బదిలీలు జేడీఏ ఆధ్వర్యంలోనే నిర్వహిస్తారు. ఆయా సిబ్బందికి కౌన్సెలింగ్ తేదీని ఇంకా ఖరారు చేయలేదు. ఇప్పటి దాకా ఆన్ లైన్ లో బదిలీల స్థానాలకు వెబ్ ఆప్షన్ ఇచ్చేందుకు సర్వర్ ఓపెన్ కాలేదు. దీంతో బదిలీ కోసం ప్రయత్నం చేసే అధికారులు, సిబ్బందిలో ఆందోళన నెలకొంది. ఒకవైపు సిఫార్సు లేఖలకోసం ప్రయత్నం చేస్తూనే మరో వైపు ఆన్ లైన్ దరఖాస్తు చేసుకొనే అందుకు వెబ్ లింక్ ఓపెన్ కోసం ప్రయత్నం చేస్తున్నారు.

సంయుక్త వ్యవసాయ సంచాలకుల కార్యాలయం

వెబ్ లింక్ సమస్య లేదు : జిల్లా వ్యవసాయ అధికారి

బదిలీలకు ఆప్షన్లు ఇచ్చుకునే ఉద్యోగులకు వెబ్‌లింక్ సమస్య లేదని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. బదిలీల కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించేందుకు ఆన్ లైన్ వెబ్ లింక్‌ను ఉద్యోగులకు తెలియజేశామన్నారు. వారు వారి సిఎఫ్ఎంఎస్ ఐడి నమోదు చేస్తే ఓటిపి వస్తుందనిఓటిపి ఆధారంగా లాగిన్ అయ్యి వారికి కావాల్సిన స్థానాల్లో ఆప్షన్ ఇచ్చుకోవచ్చని అన్నారు. బదిలీ కోసం ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్న వాటిని మాన్యువల్ గా కూడ జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం సమర్పించాలన్నారు. కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రభుత్వం నిర్ణయించిన తేదీల్లోపు పారదర్శకంగా నిర్వహిస్తామని ఆమె చెప్పారు.

తాడిపత్రి మండలం గంగాదేవిపల్లిలో ఎద్దులబండి ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు, నాయకులు

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

దేశవ్యాప్త గ్రామీణ హర్తాల్‌లో రైతుసంఘం నాయకులు, రైతులు

ప్రజాశక్తి-ఉరవకొండ

రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలు కల్పించడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం రూ.20వేల పెట్టుబడి సాయం అందించాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా చేపట్టిన గ్రామీణ హర్తాల్ కార్యక్రమంలో భాగంగా రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉరవకొండలోని కవిత సర్కిల్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు, కౌలు రైతు,కార్మిక వ్యవసాయ కార్మికుల హక్కులు పైన దాడి చేస్తూ రైతు చట్టాలకు వ్యతిరేకంగా నల్ల చట్టాలను తీసుకొచ్చి రైతాంగాన్ని పెద్ద ఎత్తున మోసం చేసిందన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా నాణ్యమైన విత్తనాలు,ఎరువులు సరఫరా చేయకుండా రైతులు వ్యవసాయమే దండగ అనే పరిస్థితి తీసుకొచ్చారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి హామీ చట్టం ఓ వరం అన్నారు. ఈ చట్టానికి నిధులు పెంచి ప్రతి జాబుకార్డుకూ 200 రోజులు పనులు కల్పించి రోజు వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులను చెల్లించాలన్నారు. వీటితోపాటు అనేక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు, రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, బాలరంగయ్య, జిల్లా నాయకులు పెద్ద ముష్టూరు వెంకటేశులు, సుంకన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సిద్ధప్ప, రవి, వీరాంజనేయులు, రైతు సంఘం నాయకులు జ్ఞానమూర్తి, ధనుంజయ్య, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం నుంచి టీ సర్కిల్ వరకూ సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి, సిఐటియు మండల అధ్యక్షుడు రంగనాథ్, మున్సిపల్ యూనియన్, శ్రీరామిరెడ్డి యూనియన్, సివిల్ సప్లై హమాలీ యూనియన్, ఆశా, అంగన్వాడీ యూనియన్ నాయకులు వన్నూరుస్వామి, నటరాజ్, అశోక్, రామచంద్ర, ఈశ్వర్, సుజాత, కవిత, డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సోము, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నాయకులు, రైతులు డిమాండ్ చేశారు. ఏపి రైతుసంఘం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన హర్తాల్‌లో భాగంగా మంగళవారం మండల పరిధిలోని గంగాదేవిపల్లి గ్రామంలో ఎడ్లబండ్ల ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకులు రాజారామిరెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా తలపెట్టిన గ్రామీణ హర్తాల్‌లో భాగంగా రైతులతో కలిసి నిరసన తెలిపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, శంకర్‌రెడ్డి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : మండల రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాలతోపాటు సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్, నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, శివశంకర్, ముత్యాలు, శంకర, నాగరాజు, నరసింహులు, ఈశ్వరయ్య, నారాయణస్వామి, మధు, రాజులక్ష్మి, పెద్దక్క, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు : సిఐటియు, రైతుసంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాప్తాడు మండల పరిధిలోని పంగల్ రోడ్డు వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.రామాంజనేయులు, రైతుసంఘం మండల కార్యదర్శి పోతులయ్య, సిఐటియు మండల కార్యదర్శి బ్రహ్మయ్య, లక్ష్మీనారాయణ, సుబ్బారావు, ప్రతాప్, ప్రకాష్, నారాయణస్వామి, మధు, రైతు సుబ్బిరెడ్డి, హమాలీలు, తదితరులు పాల్గొన్నారు

బొమ్మనహాల్ : మండల వ్యాప్తంగా నిర్వహించిన హర్తాల్ కార్యక్రమం మంగళవారం విజయవంతమైంది. ఇందులో భాగంగా ప్రధాన రహదారులపై వాహనాలను నిలిపివేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, హమాలీ యూనియన్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంలో నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, తదితరులు

బీడీ కార్మికులకు ఇళ్ల స్థలాలివ్వాలి

సిఐటియు ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

ఏళ్ల తరబడి బీడీలు చుట్టి కనీస వేతనం లేక దుర్భరమైన జీవితం గడుపుతున్న బీడీ కార్మికులకు స్థలాలతోపాటు ఇళ్లు మంజూరు చేయాలని బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఉమాగౌడ్ డిమాండ్ చేశారు. ఈమేరకు బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ రజాక్‌వలికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడిపత్రి పట్టణ, పరిసర ప్రాంతాల్లో గత 20ఏళ్ల నుంచి బీడీ రోలింగ్ పనిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వెయ్యి బీడీలు చుడితే కేవలం రూ.200 ఇస్తున్నారన్నారు. కనీస వేతనం లేక దుర్భరమైన జీవన పరిస్థితులను అనుభవిస్తున్న బీడీ కార్మికులకు ప్రభుత్వం ఇండ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. అనేకమార్లు విన్నవించినా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో వంటావార్పు చేసి నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీడీ కార్మిక సంఘం నాయకులు రహీం, బషీరన్, కెవిపిఎస్ నాయకులు నాగరాజు, రామ్మోహన్, శ్రీరాములు, కుళ్లాయప్ప, జగన్మోహన్‌రెడ్డి, జ్యోతిలత, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

గృహం మంజూరు చేయాలని వేడుకోలు

రాప్తాడు : ప్రభుత్వ గృహం మంజూరు చేయాలని మండల కేంద్రంలోని కోట వీధి కాలనీలో నివాసం ఉంటున్న బి.రాముడు కోరుతున్నాడు. ఇటీవల కురిసిన వర్షానికి రాముడుకు చెందిన ఇంటి ఆవరణలోని ప్రహరీ కూలిపోయింది. దీనికితోడు ఇంటిలోపల కూడా గోడలు బీటలు వారాయి. ఈ నేపథ్యంలో ఎప్పుడేం జరుగుతుందో అని భయంభయంగా గడుపుతున్నామన్నారు. కావున ప్రభుత్వం తనకు నూతన గృహం మంజూరు చేయాలని కోరుతున్నాడు.

మానవ జీవితంలో తేనె దివ్య ఔషధం

బ్రహ్మసముద్రం : మానవ జీవితంలో తేనె దివ్య ఔషధంలా పని చేస్తుందని జన విజ్ఞాన వేదిక (జెవివి) తాలూకా ఉపాధ్యక్షుడు టీచర్ రాజన్న తెలిపారు. మంగళవారం జెవివి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్‌లో తేనెటీగల దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు, గ్రామస్తులకు తేనె ఉపయోగాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేనెటీగలు ఐక్యతకు, పరోపకార గుణానికి, కష్టపడే అంకితభావాలను గుర్తుకు తెస్తాయన్నారు. తేనె తాగడం వల్ల ఎర్ర రక్తకణాలు పెంచడంతోపాటు కీమోథెరపీకి చాలా ఉపయోగంగా ఉంటుందన్నారు. కృత్రిమ తేనె కన్నా అడవుల్లో లభించే తేనె చాలా మంచిదన్నారు.

23న ఉచిత కంటి వైద్యశిబిరం

గుత్తి : పట్టణంలోని విరుపాక్షరెడ్డి కన్వర్షన్ హాల్లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 23వతేదీన ఉచిత కంటి ఆపరేషన్ల మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బెంగళూరు చెందిన శంకర కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు పరీక్షలు చేసి అవసరమైన వారిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి బెంగళూరు శంకర కంటి ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టంగుటూరుకి నివాళి

గుత్తి : స్వాతంత్ర్య సమరయోధులు, రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 68వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని పెన్షనర్ల భవనంలో చిత్రపటానికి పూలమాలల వేసి నివాళు లర్పించారు. నివాళులర్పించిన వారిలో పెన్షనర్ల సంఘం తాలూకా అధ్యక్షులు కె.అబూబకర్, ఉపాధ్యక్షురాలు స్వర్ణాంబ, అదనపు కార్యదర్శి జెన్నే కుళ్లాయిబాబు, నాయకులు షేక్షావలి, నారాయణరెడ్డి, చెన్నారెడ్డి, నారాయణశెట్టి పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటింటి చెత్త సేకరణ

ఉరవకొండ : పకడ్బందీగా ఇంటింటి చెత్త సేకరణ చేపట్టాలని డిఎల్‌పిఒ విజయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. మంగళవారం మేజర్ పంచాయతీలోని వివిధ వార్డుల్లో చెత్త సేకరణ చేపట్టడానికి రూ.2.50 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన 10 ట్రై సైకిళ్లను పంచాయతీ కార్మికులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు లలిత, ఎంపిడిఒ రవిప్రసాద్, ఇఒఆర్‌డి సతీష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్, వార్డు సభ్యులు నిరంజన్‌గౌడ్, వాసుదేవుడు, రవికుమార్, రామాంజనేయులు, శర్మాస్, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు గార్లదిన్నెలో మినీ మహానాడు

శింగనమల : గార్లదిన్నె మండలం మర్తాడు సమీపంలో 'టి' కన్వెన్షన్ హాల్‌లో బుధవారం మినీ మహానాడు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, నియోజకవర్గ అబ్జర్వర్ పర్వీన్‌తాజ్, ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు హాజరుకానున్నట్లు తెలిపారు. కావున ఆరు మండలాల టిడిపి కుటుంబ సభ్యులందరూ తప్పకుండా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విశ్వాసాన్ని చాటిన గ్లోబల్ కనెక్ట్ యాత్ర

శింగనమల : సిడ్నీ, మెల్‌బోర్న్, బ్రిస్బేన్, ఆక్లాండ్, సింగపూర్ నగరాల్లో జరిగిన వైసిపి గ్లోబల్ కనెక్ట్ మీటింగ్‌లు అద్భుతంగా సాగాయని వైసిపి ఎన్ఆర్ఐ వింగ్ అధ్యక్షులు ఆలూరు సాంబశివారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి మీటింగ్‌లో జగనన్న నాయకత్వంపై ఉన్న నమ్మకం, ప్రజల కోసం సాగిన పాలనపై గౌరవం స్పష్టంగా కనిపించిందన్నారు. ఆయన తీసుకొచ్చిన పాలనా మార్పులు, ఆరోగ్య సంస్కరణలు, విద్యా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు గణాంకాలతో నిరూపించాయన్నారు. ఎన్నారైల ఆదరణ తనకు గౌరవం మాత్రమే కాదని, బాధ్యతను కూడా పెంచిందన్నారు.

హుండీ లెక్కింపు

ఉరవకొండ : మండల పరిధిలోని పెన్నోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా హుండీల్లో భక్తులు సమర్పించిన ముడుపులు, కానుకలను ప్రత్యేక అధికారి డి.పాండురంగారెడ్డి పర్యవేక్షణలో మంగళవారం లెక్కించారు. ఈ లెక్కింపులో రూ.15,85,888 ఆదాయం వచ్చిందన్నారు. అన్నదానం హుండీ ద్వారా రూ.8,212 ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు, అధికారులు ఇన్స్‌పెక్టర్లు వన్నూరుస్వామి, కె.రాణి, టిడిపి మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్, మోపిడి గోవిందు, షేక్షానుపల్లి గుర్రం నరేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు తాగునీటి సరఫరాలో అంతరాయం

రాయదుర్గం : పైప్‌లైన్ లీకేజీల మరమ్మతుల కారణంగా పట్టణంలో రెండు రోజులపాటు తాగునీటి సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాతిబావి వంక గ్రామ సమీపంలో కనేకల్ రోడ్డు వద్ద పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులు చేస్తున్నందున ఈనెల 21, 22వతేదీల్లో పట్టణంలో తాగునీటి సరఫరా ఉండదన్నారు. నీటి సరఫరాలో కలిగిన అంతరాయానికి పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

టిబి, లెప్రసీ యూనిట్ల తనిఖీ

కళ్యాణదుర్గం రూరల్ : కళ్యాణదుర్గం సామాజిక ఆరోగ్యం కేంద్రంలో ఉన్న టిబి, లెప్రసీ యూనిట్లను జిల్లా ఎయిడ్స్, క్షయ, లెప్రసీ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐసిటిసి సూపర్‌వైజర్ వెంకటరమణ, రాజేష్‌కుమార్, టీబీ పిపిఎం నాగమణి, టిబి యూనిట్ సూపర్‌వైజర్లు సత్యనారాయణ, రిడ్స్ ప్రాజెక్టు మేనేజర్ మహేష్, కిరణ్, శివకుమార్, సంతోషమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలి

అనంతపురం : ఆర్డీటీకి సంబంధించి (ఎఫ్‌సిఆర్ఎ) ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్‌ను కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించాలని దివ్యాంగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో మాంఛూఫెర్రర్‌ను దివ్యాంగ సంఘాల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాంచోఫెర్రర్ మాట్లాడుతూ పదిరోజుల కిందట ఢిల్లీకి వెళ్లి పెద్దలతో మాట్లాడామని రెన్యువల్ కాకుండా కొత్త అప్లికేషన్ పెట్టుకోమని చెప్పారన్నారు. కొత్తగా అప్లికేషన్ వచ్చి వచ్చామని, త్వరలోనే శుభవార్త వింటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎపి దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కోఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి, దివ్యాంగుల హక్కుల వేదిక జిల్లా అధ్యక్షులు వసంత కుమార్, కార్యదర్శి రాజేష్, చెన్నమలప్ప, దివ్యాంగులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌ను శుభ్రంగా ఉంచాలి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం

ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం అనంతపురంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్ ఆవరణలో ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయడంతో అసహనం వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ డస్ట్ బిన్లలో వేయకుండా చెత్తను బయట పడేస్తున్నారని, పరిశుభ్రత చర్యలు ఎప్పటికప్పుడు తీసుకోవాలని ఆదేశించారు. స్టాల్స్ ఎదుట డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేయాలన్నారు. స్టాల్స్ ఎదుట డస్ట్ బిన్స్ లేకపోవడంతో వారి నుంచి జరిమానాలను వసూలు చేయాలన్నారు. బస్టాండ్ ఆవరణంలోని రెండు షాపులపై 25 వేల రూపాయల చొప్పున జరిమానా విధించి వసూలు చేయాలని, అప్పటివరకు రెండు షాప్ లను మూసివేయించాలన్నారు. బస్టాండ్ ఆవరణంలోనూ, ప్రతి స్టాల్ ముందు కూడా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం సుమంత్ ఆర్.ఆధోని, కమిషనర్ బాలస్వామి, డిపో మేనేజర్ నాగభూపాల్, స్టేషన్ మేనేజర్ మూర్తి, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను చదివిద్దాం

ఉరవకొండ : ఆడపిల్లలకు బాల్య వివాహాలు చేయకుండా చదివిద్దామని హెల్త్ హెడ్యుకేటర్ షఫీ, సిహెచ్ఒ నాగరంగయ్య పిలుపునిచ్చారు. మండల పరిధిలోని రాకెట్లలో భేటీ బచావో – భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆడ పిల్లను సంరక్షిద్దాం ఆడ పిల్లను చదివిద్దాం అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది తల్లిదండ్రులు ఆడపిల్లలను చదివించకుండా సరైన వివాహ వయస్సు రాకుండానే బల్య వివాహాలు చేస్తున్నారన్నారు. పుస్తకాలు మోసే వయసులో పుస్తెల భారం వద్దన్నారు. కావున ఆడపిల్లలను చదివించి మంచి భవిష్యత్తును ఇద్దామని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జి.శేఖర్, స్వర్ణలత, స్టాఫ్‌నర్సులు సునీత, జినాతున్నీసా, కుమారీబాయి, తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షపై అవగాహన

కళ్యాణదుర్గం రూరల్ : కళ్యాణదుర్గం పరిధిలోని ముదిగల్లు గ్రామంలో బాల్య వివాహాల నిరోధక చట్టం, లింగ నిర్ధారణ, లింగ వివక్షపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విద్యా బోధకుడు కంచె లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బాల్య వివాహాలు అనాగరికం అన్నారు. ఆధునిక కాలంలో కూడా తల్లిదండ్రులు చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేయడం మంచిది కాదన్నారు. కావున ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకురాలు కళావతి, ఆరోగ్య కార్యకర్త ఉమా, మహిళా పోలీస్ సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

పుట్లూరు : ఎపి మోడల్ స్కూల్లో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఓబుల్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి ఈనెల 22వతేదీతో ముగుస్తుందన్నారు. కావున ఇంటర్‌లో ప్రవేశాలు పొందాలనుకునే వారు ఎపి మోడల్ స్కూల్ వెబ్‌సైట్‌లో https://apms.apcfss.in దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

విద్యాశాఖ కార్యాలయానికి చేరిన పుస్తకాలు

యల్లనూరు : 2025–2026 నూతన విద్యా సంవత్సరానికి 1 నుంచి 10వ తరగతి వరకూ పాఠ్య, నోట్ పుస్తకాలతోపాటు యూనిఫామ్ విద్యాశాఖ కార్యాలయానికి చేరినట్లు మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. మండలం వ్యాప్తంగా 2,447 మంది విద్యార్థులు ఉండగా 8,410, పాఠ్య, వర్క్ పుస్తకాలు, 12,168 నోట్ పుస్తకాలు, విద్యార్థులకు యూనిఫామ్‌లు వచ్చాయన్నారు. అలాగే ఇంకా బెల్టు, బూట్లు వైట్ నోట్ పుస్తకాలు, డిక్షనరీ, బ్యాగులు రావాల్సి ఉందన్నారు.

మహారాజశ్రీ పీలేరు 11వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

M.V.O.P. No: 4/2018

S.K. లోకేష్ నాయక్ @ లోకేష్ నాయక్.
...రెస్పాండెంట్స్

Vs

P. నాగేంద్రనాయక్ @నాగేంద్ర నాయక్ మరియు వగైరాలు.
...రెస్పాండెంట్ నెం.2

2వ రెస్పాండెంట్‌నకు నోటీసు

2. మంచూరి చిన్న రెడ్డెప్ప రెడ్డి, S/o M. ఆంజినేయ రెడ్డి, నివాసం: D.No: 7-23, BC కాలనీ, పోలీస్ స్టేషన్ ఎదురుగా, రాప్తాడు టౌన్ & మండలం, అనంతపురం జిల్లా.

పై పిటీషనర్ దాఖలు చేసిన పై పిటీషన్ నందు మీ హాజరు నిమిత్తమై పై కనిన పిటిషన్ ను తేది: 25.06. 2025వ తేదీన వాయిదా వేసిఉన్నారు, కావున మీరు నేరుగా కాని లేదా న్యాయవాది ద్వారా కాని పై కోర్టులో 25.06. 2025 తేదీన ఉదయం 10.30 గంటలకు హాజరై మీ వాదనలను తెలుపుకొనవలెను లేని యెడల మీ పరోక్షమున తీర్పు ఇవ్వబడునని తెలియచేయడమైనది.

//By Order of Court//

పి. షౌకత్ అలి, M.A., B.L.,
న్యాయవాది, పీలేరు.
Cell No : 9441451350

పబ్లిక్ నోటీసు

నా కక్షిదారుడైన షేక్ మహబూబ్ బాష S/o షేక్ బాబు సాబ్, రజాపురం గ్రామస్థుడు, షెడ్యూలు దాఖలా ఆస్తికి యజమానిగా వుంటున్నాడు. నా కక్షిదారుడు తన స్వగ్రామం నుంచి గుత్తికి వచ్చునప్పుడు తన ఆస్తికి సంబంధించిన పత్రము నెం.7585/2024 తన పేరు వున్న పత్రము పోగొట్టుకున్నాడు. సదర పత్రము గురించి గుత్తి పోలీసు స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా, సదరు పోలీస్ వారు 10.05.2025వ తేదిన పత్రము దొరకలేదని సర్టిఫికెట్ ఇచ్చియున్నారు. మా కక్షిదారుడు ఒరిజినల్ పత్రము పోయినందున, పత్రము నకలును ఆస్థి అమ్మట కొరకు ఉపయోగించు కుంటున్నారు. ఎవరికైనా ఎటువంటి ఆక్షేపణలు వున్నా, లేని యెడల ఒరిజినల్ పత్రము వున్నా 7 రోజుల లోపల తెలుపవలసినది, లేని యెడల మా కక్షిదారుడు సదరి పత్రము యొక్క నకలును, ఇతర పత్రములతో కలిపి ఆస్థిని అమ్ముచున్నాడు.

Schedule

Property situated in the RD of Anantapur, SRD of Gooty within Rajapuram village limits with the following particulars.

Babu	L.P. No.	Sy.No.	Extent
Govt. Dry	507	136-1	0.6840 cents

Bounded by
East: Land of Undra Sivaiah,
West : Land of Chandrasekhar,
North : Gooty to Guntakal road NH-63,
South : Kaluva.

M. Sreedhar,
Advocate, Gooty.
Mobile 9849483653.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి

బొమ్మనహాల్ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిఎల్‌డిఎ నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని ఉంతకల్లు గ్రామంలో డిఎల్‌డిఒ పర్యటించారు. ఇందులో భాగంగా చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలించి ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలించారు. అలాగే పంచాయతీ పరిధిలోని రికార్డులు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఇంటి, నీటి పన్నుల వసూళ్లు, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ విజయభాస్కర్, ఇఒఆర్‌డి దాస్, పంచాయతీ కార్యదర్శి పల్లవి పాల్గొన్నారు.

ఘనంగా కుంభాభిషేకం

యల్లనూరు : మండల కేంద్రంలో వెలసిన అభయాంజనేయ స్వామి ఆలయంలో అర్చకులు మంగళవారం కుంబాభిషేకం రుద్రాభిషేకం వంటి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, ప్రజలకు అభిషేక జలాలతోపాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం హోమ పూజలను ప్రారంభించారు. హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం చివరి రోజు హనుమాన్ జయంతి అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.

22న కౌలు రైతుల సదస్సు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండలో ఈనెల 22న నిర్వహించనున్న కౌలు రైతుల సదస్సును విజయవంతం చేద్దామని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, బాలరంగయ్య పిలుపునిచ్చారు. మంగళవారం ఉరవకొండలోని గవిమఠం ప్రాంగణంలో కౌలు రైతుల సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలతో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన కౌలు చట్టం అమలు చేసి ఎలాంటి షరతులు లేకుండా కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో గ్రామసభలు ఏర్పాటు చేసి సీసీఆర్‌సి కార్డులు ఇచ్చి బ్యాంకుల ద్వారా పంట రుణాలు ఇవ్వాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతులందరికీ గ్రామ పంచనామా ఆధారంగా పది లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. ఉరవకొండ మండల పరిధిలోని రేణిమాకులపల్లి, ఇంద్రావతి, మోపిడి, చిన్నముష్టూరు, పెద్దముష్టూరు, ఆమిద్యాల, విడపనకల్లు మండల పరిధిలోని వేల్పుమడుగు, కొట్టాలపల్లి, విడపనకల్, మాలాపురం, ఆర్.కొట్టాల, పాల్తూరు, హావలిగి, తదితర గ్రామాలలో కౌలు రైతులను కలుసుకుని సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యలపై పోరాడేందుకు అవగాహన సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు పెద్ద ముష్టూరు వెంకటేశులు, మోపిడి సుంకన్న, సురేష్, నారాయణస్వామి, పెద్ద ముష్టూరు క్రిష్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న రైతుసంఘం నాయకులు

కార్పొరేషన్‌లో పని వాతావరణం కల్పించండి

ఉద్యోగులకు కమిషనర్ ఆదేశాలు

మాట్లాడుతున్న కమిషనర్ బాలస్వామి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉద్యోగులు సీట్లలో ఉండి పని చేస్తున్నారన్న వాతావరణాన్ని కల్పించాలని కమిషనర్ భీమిశెట్టి బాలస్వామి సూచించారు. మంగళవారం స్థానిక కౌన్సిల్ హాలులో అన్ని విభాగాల ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఒక్కో ఉద్యోగి కార్యాలయంలో నిర్వహించే పనుల గురించి ఆరాతీయగా టౌన్ ప్లానింగ్‌లో జి.3 క్లర్కుగా పనిచేస్తున్న బాలాజీ మార్చి ఒకటో తేదీ నుంచి విధులకు రావటం లేదని తెలియడంతో కమిషనర్ అవాక్కయ్యారు. డేస్పాచ్‌లో లీవ్ లెటర్ వేసి లాంగ్ లీవ్ వెళ్లిపోయాడని ఎస్టాబ్లిష్మెంట్ క్లర్క్ శరత్ వివరించారు. అనంతరం కమిషనర్ స్పందిస్తూ అనారోగ్యం ఉంటే ఉన్నతాధికారిని కలిసి లీవ్ లెటర్ మంజూరు కోసం సంతకం తీసుకుని సెలవు తీసుకోవాలన్నారు. అయితే లాంగ్ లీవ్ కై డేస్ ప్యాచ్ విభాగంలో లెటర్ ఇచ్చి వెళ్లడం సరికాదన్నారు. మార్చి ఒకటి నుంచి విధులకు హాజరు కాకుండా జీతాల బిల్లు అతనికి ఎవరు చేస్తున్నారని ఎలా చేస్తున్నారని వాకబు చేశారు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన గుమాస్తా బాలాజీపై సస్పెన్షన్‌కు చర్యలు చేపట్టాలని డిప్యూటీ కమిషనర్ పావనిని ఆదేశించారు. దీంతోపాటు కార్పొరేషన్ పని చేస్తున్న ప్రతి ఒక్కరి విధులపై ఆరాతీసి నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై చర్యలకు ఆదేశించారు. ఉద్యోగుల్లో అధిక శాతం మంది సీనియర్ అసిస్టెంట్ పేరుకు రెండు, మూడు సీట్లు నిర్వహిస్తున్నామని చెప్పటమే గానీ, అక్కడ చేస్తున్న పని ఏమీ లేదన్నారు. ఇప్పటి నుంచైనా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఉద్యోగులు సీట్లలో ఉండి పని చేసే వాతావరణం కల్పించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ పావని, సూపరింటెండెంట్ ఇంజినీర్ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ కోసం శ్రమించిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం

మినీ మహానాడులో ఎంపి, ఎమ్మెల్యే

మినీ మహానాడుకు హాజరైన టిడిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హామీ ఇచ్చారు. మంగళవారం నగరంలోని కమ్మ భవన్‌లో మినీ మహానాడు కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గత రెండేళ్లలో మృతిచెందిన టిడిపి కార్యకర్తలను నివాళులర్పిస్తూ మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టు తర్వాత తెలుగుదేశం పార్టీ ఉంటుందా లేదా అన్న కామెంట్స్ దగ్గర నుంచి 164 స్థానాలతో విజయం సాధించి వైసీపీని నేలమట్టం చేశాన్నారు. దీనికి ప్రధానమైన కారణం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ అన్నారు. పార్టీలో కష్టపడ్డ అందరికీ న్యాయం చేస్తామన్నారు. కోటి సభ్యత్వాలతో దేశంలో ఏ ప్రాంతీయ పార్టీకి లేనన్ని సభ్యత్వాల రికార్డును సాధించారన్నారు. కేవలం వంద రూపాయలు కడితే రూ.5 లక్షల భీమా సౌకర్యం కల్పించారన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో మరణించిన 5 మంది కార్యకర్తల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల వరకు సాయం అందిందన్నారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేస్తూ పార్టీ అభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. అనంతపురం నగరానికి దూరంగా డంపింగ్ యార్డ్‌ను తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణం, మరువంక నడిమి వంక లకు సైడ్ వాల్స్ ఏర్పాటు, అనంతపురం నగరానికి ఎలక్ట్రికల్ సిటి బస్సుల కోసం ప్రతిపాదనలు పంపించారని తెలిపారు. బీసీ భవన్, కాపు భవన్, వైశ్య భవన్, పద్మశాలి భవన్, ముస్లిం మరియు క్రిస్టియన్ మైనారిటీ భవన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతపురం అర్బన్ తెలుగుదేశం పార్టీ నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. పార్టీలో ఉన్నది ఒక్కటే గ్రూప్ అని అది నారా చంద్రబాబు నాయుడు గ్రూప్ అన్నారు. అంతే తప్పా ఎలాంటి గ్రూపులు నియోజకవర్గంలో ఉండవని మనమంత ఐక్యమత్యంగా ఉండి ప్రభుత్వ ప్రతిష్టతను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అబ్జర్వర్ లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు బాంబే డెయింట్ నాగన్న, సరిపూటి సూర్యనారాయణ, గడ్డం సుబ్రమణ్యం, రాష్ట్ర నాయకులు ఆదినారాయణ, బుగ్గయ్య, చౌదరి, చంద్రదండు పరిమి ప్రకాష్‌నాయుడు, మైనార్టీ నాయకులు సాలార్ బాషా, టౌన్ బ్యాంకు ఛైర్మన్ జెఎల్.మురళి, మాజీ మేయర్ స్వరూప, కొండవీటి భావన, బల్లా పల్లవి, స్వప్న, సంగా తేజశ్విని, వడ్డే సరళ, లింగారెడ్డి, స్వామిదాస్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు


జర్నలిస్టులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న ఆలం వెంకటనరసానాయుడు, ఎస్ఐ సాగర్

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో పది రోజులుగా వెంకట్ వకుళా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా సాగింది. ఇందులో భాగంగా మంగళవారం మండల పాత్రికేయ, పోలీసులు, మండల పంచాయతీ కార్మికుల జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్‌లు జరిగాయి. పాత్రికేయ పోలీస్ జట్టు పంచాయతీ వారియర్స్ చేతిలో స్వల్ప తేడాతో ఓడిపోయింది. మొదట బ్యాటింగ్ ఎంచుకున్న పాత్రికేయ పోలీస్ జట్టు నిర్ణీ 10 ఓవర్లలో 90 పరుగులు చేసింది. ఓపెనర్లుగా పాత్రికేయులు షేర్‌ఖాన్, శంకర్ మంచి శుభారంభాన్ని అందించారు. మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ కానిస్టేబుల్ భార్గవ్ 40, అమర్ 15 పరుగులతో రాణించారు. అనంతరం బ్యాటింగ్‌కి దిగిన పంచాయతీ వారియర్స్ జట్టు 9 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. పంచాయతీ వారియర్స్ జట్టులో బ్రహ్మ, శ్రీనివాసులు, రాజారెడ్డి చక్కటి బ్యాటింగ్ చేస్తి విజయానికి తోడ్పడ్డారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెంకట వకుళ ఫౌండేషన్ ఛైర్మన్ ఆలం వెంకట నరసానాయుడు, ఎస్ఐ సాగర్ క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి



తహశీల్దార్ రజాక్‌వలికి వినతిపత్రం అందజేస్తున్న ఆశాకార్యకర్తలు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ రజాక్‌వలికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశావర్కర్లు పద్మావతి, నాగరత్న మాట్లాడుతూ గత 20ఏళ్లుగా పేదలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నామన్నారు. మరోవైపు ప్రభుత్వం పెరిగిన జనాభాకు అనుగుణంగా ఆశావర్కర్లను నియమించడం లేదన్నారు. దీనికితోడు అనేక కార్యక్రమాలను తమతో నిర్వహిస్తుండటంతో పని ఒత్తిడి పెరిగిందన్నారు. కావున పని ఒత్తిడి తగ్గించడంతోపాటు సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఉమాగౌడ్, జగన్‌మోహన్‌రెడ్డి, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.